
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

మంగళవారం 27 ఫిబ్రవరి 2024

ఆగని గిరి విద్యార్థుల మరణాలు


విద్యార్థుల మరణాలపై ఐటీడీఏ ముందు రిలే దీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)


గత నెలలో మృతి చెందిన కస్తూర్బా విద్యార్థిని వంతాల రాణి (ఫైల్)


తాజాగా మృతి చెందిన గురుకుల విద్యార్థి ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

తాజాగా కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యార్థి మృతి

వరుస మరణాలతో విద్యార్థుల తల్లిదండ్రులు బెంబేలు

ఈ విద్యా సంవత్సరంలో 12 మంది మృత్యువాత

ఆశ్రమాల్లో హెల్త్ వలంటీర్ల నియామకంపై సర్కారు నిర్లక్ష్యం

దీనిపై స్పందించి లేఖ విడుదల చేసిన మావోయిస్టులు

మరణాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు, తల్లిదండ్రుల డిమాండ్

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంలో గిరిజన విద్యార్థుల మరణాలు ఆగడం లేదు. దీనిపై ప్రభుత్వం నుంచి కూడా స్పందన లేదు. ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు హెల్త్ వలంటీర్ల నియామకంపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది గిరిజన విద్యార్థుల మరణాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని విద్యార్థి, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో తీవ్ర అనారోగ్యానికి గురైన విద్యార్థులు మృతి చెందుతున్నారు. తాజాగా కొయ్యూరు బాలురు గురుకులంలో పదో తరగతి చదువుతున్న జి.ప్రవీణ్‌కుమార్ అనే విద్యార్థి కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడు. గతవారం పాడేరులోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు బాలికలు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. గతేడాది డిసెంబరులో జి.మాడుగుల కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్న పాంగి కమల(12), ఈ ఏడాది జనవరిలో ఎనిమిదో తరగతి విద్యార్థిని వంతాల రాణి(14) మృతి చెందారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల- 2లో ఏడో తరగతి విద్యార్థినులు ఎల్.రాజ్యలక్ష్మి(13) పచ్చకామెర్లతో గతేడాది జూన్‌లో, వి.లావణ్య(13) టైఫాయిడ్‌తో, డిసెంబరులో ఆరో తరగతి విద్యార్థి కె.మీనాలక్ష్మి(12) టైఫాయిడ్‌తో మృతి చెందారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల-1లో తొమ్మిదో తరగతి చదువుతున్న జె.అనిల్‌కుమార్(15) గతేడాది డిసెంబరులో టైఫాయిడ్‌తో మృతి చెందగా, పెదబయలు మండలం రూడకోట ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి కె.సోమేశ్(12) గతేడాది అక్టోబరులో కడుపునొప్పితో మృతి చెందాడు. ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని పి.లావణ్య(11) గతేడాది అక్టోబరులో ఫిట్స్‌లో మృతి చెందింది. కాగా గతేడాది డిసెంబరులో డుంబ్రిగుడలోని ఆశ్రమ పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి బురిడి సంతోశ్‌కుమార్(12) గెడ్డలో స్నానానికి వెళ్లి మునిగిపోయి మృతి చెందాడు. ఈ లెక్కన కేవలం ఈ విద్యా సంవత్సరంలోనే 12 మంది గిరిజన విద్యార్థులు వివిధ కారణాలతో మృతి చెందారు. ఇవి వెలుగులోకి వచ్చిన సంఘటనలు మాత్రమే. ఇలా వెలుగులోకి రాని విద్యార్థుల మరణాలెన్నో తెలియని పరిస్థితి. వివిధ కారణాలతో మృతి చెందడంతో ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా లేని దుస్థితి కొనసాగుతున్నది. ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు హెల్త్ వలంటీర్ల నియామకంపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యార్థుల ఆరోగ్య రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని విద్యార్థి, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సైతం ఆశ్రమ పాఠశాల నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య రక్షణపై కనీసం దృష్టిపెట్టడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సబ్‌కలెక్టర్‌గా పని చేసిన ఆయన ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన ఈ పది నెలల్లో ఆశ్రమ పాఠశాలల వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఆఖరికి ఏటీడబ్ల్యూవోలు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలతో ఒక్క సమావేశాన్ని నిర్వహించిన దాఖలాలు లేవు. పలువురి ఒత్తిడి మేరకు ఎట్టకేలకు తాజాగా ఈ నెల 20న ఆశ్రమ విద్యపై అధికారులు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. వాస్తవానికి ఐటీడీఏ పీవో ఆశ్రమ పాఠశాలను తరచూ సందర్శిస్తూ, వాటిని పర్యవేక్షిస్తుండాలి. కానీ ఆటువంటి ... మిగతా 8వ పేజీలో


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

విశాఖ-అల్లూరి-అనకాపల్లి[వీఏఏ] డివిజన్ కమిటీ

ఫిబ్రవరి 14, 2024

పత్రిక ప్రకటన

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మరణాలకు కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే!

ఈ మరణాలకు బాధ్యత వహిస్తూ రంపచోడవరం ITDA పి.ఓ. సూరజ్ గనోరే రాజీనామా చేయాలి.

పాడేరు పీ.ఓ. వి.అభిషేక్ ను తక్షణమే సస్పెండ్ చేయాలి!

ఫిబ్రవరి 13వ తేదీ న విశాఖ జిల్లా మారికవలస గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న 12ఏళ్ళ జర్సింగి భటిక్ అనే విద్యార్థి 3 రోజులుగా జ్వరంతో బాధపడుతూ వైద్యం అందక చనిపోయాడు. ఇదేమీ కొత్త విషయం కాదు. ఎందుకంటే ఈ ఒక్క నెలలోనే వివిధ ఆశ్రమ పాఠశాలలో పది, పన్నెండేళ్ళ చిన్నారులు వరుసగా నలుగురు మరణించారు. గత ఆరు నెలల్లో ఈ మరణాలు పదుల సంఖ్యలోనే వున్నాయి. అయినా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ ఏమాత్రం స్పందించడం లేదు. పైగా ITDA ల పీఓలు సూరజ్ గనోరే, వి. అభిషేక్, గిరిజన విద్యాశాఖ డిడి కొండలరావు లు పోర్టల్ల నుండి పిల్లలు చెప్పకుండా వెళ్ళిపోతున్నారనీ, తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా [illegible] వలన, నాటువైద్యం అందించడం వలనే పిల్లలు మరణిస్తున్నారని

విద్యార్థుల మరణాలపై 14న మావోయిస్టులు విడుదల చేసిన లేఖ

మరణాలను అరికట్టేందుకు చర్యలు

ఐటీడీఏ పీవో వి.అభిషేక్



పాడేరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ విద్యాలయాల్లో విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై ఆయన స్పందించారు. విద్యార్థులకు జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నామన్నారు. మరింత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి విద్యార్థులకు అందించాల్సిన వైద్య సేవలు, భోజన మెనూ అమలుపై తగిన ఆదేశాలిచ్చామన్నారు. జువైనల్ జస్టిస్ ఆదేశాల మేరకు ఆశ్రమ విద్యాలయాల్లోకి బయట వ్యక్తులను అనుమతించడం లేదన్నారు. గిరిజన సంక్షేమాధికారులు నిరంతరం ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధపెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.


గోడ కూలిపోయిన జీసీసీ గ్యాస్ గోదాము

కొత్త గ్యాస్ గోదాము నిర్మాణం జరిగేనా?

ఐదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

స్థలాన్ని కేటాయించినా నిర్మాణం ప్రారంభం కాని వైనం

ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న గోదాము శిథిలావస్థకు..

ఆరు బయటే సిలిండర్లను భద్రపరుచుకోవలసిన పరిస్థితి

చింతపల్లి, ఫిబ్రవరి 26: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మార్కెట్ యార్డు వద్ద అద్దెకు తీసుకున్న గ్యాస్ గోదాము శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆరుబయట సిలిండర్లను భద్రపరుస్తూ రాత్రి, పగలు కాపలా కాయాల్సి దుస్థితి నెలకొంది. జీసీసీకి సొంత గోదాములు లేకపోవడం, ప్రత్యామ్నాయ గోదాములు అందుబాటులో లేకపోవడం వల్ల జీసీసీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జీసీసీకి నూతన గ్యాస్ గోదాము నిర్మించేందుకు వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన ఐదేళ్లుగా కార్యరూపం దాల్చక పోవడంతో అవస్థలు తప్పడం లేదు.


ఆరుబయట సిలిండర్లను భద్రపరుస్తున్న జీసీసీ అధికారులు

చింతపల్లి, కొయ్యూరు, జీకేవీధి మండలాల్లో హెచ్‌పీసీఎల్ కంపెనీ గ్యాస్ పంపిణీ ఏజెన్సీ బాధ్యతలను గిరిజన సహకార సంస్థ తీసుకుంది. సుమారు 18 ఏళ్లుగా మూడు మండలాల్లో వినియోగదారులు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చింతపల్లి జీసీసీ ఏజెన్సీ ద్వారా గ్యాస్ పంపిణీ జరుగుతున్నది. గ్యాస్ సిలిండర్లు భద్రపరిచేందుకు జీసీసీకి సొంత గోదాములు అందుబాటులో లేవు. దీంతో జీసీసీ అధికారులు మార్కెట్ యార్డులోని ఒక గోదామును అద్దెకు తీసుకున్నారు. ఈ గోదాముకి ప్రతీ నెల జీసీసీ రూ.4,800 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. మూడు మండలాల్లో సుమారు 12 వేల గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన సిలిండర్లు చింతపల్లి గోదాములో భద్రపరుస్తున్నారు.

అయితే ఎనిమిది నెలల కిందట ఈ గోదాము ముందు భాగం గోడ కూలిపోయింది. అలాగే పైకప్పు కూడా కిందకు జారిపోయింది. దీంతో జీసీసీ అధికారులు గోడ కూలిపోయిన గ్యాస్ గోదాములోని ఒక భాగానికి స్వల్ప మరమ్మతులు చేసుకుని ఐదు కిలోల సిలిండర్లను భద్రపరుస్తున్నారు. అత్యధిక సంఖ్యలో గ్యాస్ సిలిండర్లు ఆరుబయట భద్రపరుస్తూ వినియోగదారులకు పంపిణీ చేస్తున్నారు. సిలిండర్లు అపహరణకు గురికాకుండా రాత్రివేళ వాచ్‌మన్‌ను కాపలా పెట్టారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్, జీసీసీ ఎండీ దృష్టికి స్థానిక డీఎం పి.దేవరాజు తీసుకు వెళ్లారు. నూతన గోదాము నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు జీసీసీ అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కాగా గ్యాస్ గోదామును ... మిగతా 8వ పేజీలో

చంద్రబాబు తిరుగు ప్రయాణం

శ్రీకాకుళంలో 'రా...కదలిరా' సభ ముగించుకుని హైదరాబాద్ బయలుదేరిన టీడీపీ అధినేత

ఆయన్ను కలిసేందుకు భారీగా తరలివచ్చిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నాయకులు


విమానాశ్రయంలో చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పీలా శ్రీనివాస్ తదితరులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 26: శ్రీకాకుళం జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్ ప్రయాణమైన తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సోమవారం రాత్రి విమానాశ్రయంలో పార్టీ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. చంద్రబాబునాయుడు శ్రీకాకుళంలో 'రా...కదలిరా' సభను ముగించుకుని రోడ్డు మార్గంలో రాత్రి 8.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన వెంట శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఉన్నారు. ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్దా నాగజగదీశ్వరరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, గుమ్మడి సంధ్యారాణి, కోళ్ల లలితకుమారి, కోరాడ రాజబాబు, హర్షవర్ధన్‌ప్రసాద్, పీలా శ్రీనివాస్, తదితరులు చంద్రబాబునాయుడుకు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.



అరకు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభం

అరకు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జేసీ భావన వశిష్ఠ, బీజేపీ నాయకులు

అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా సోమవారం పలు పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా అరకు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. - 8లో

పంచాయతీల నిధులు జమ చేయండి

డీఆర్‌వోకు సర్పంచుల వినతి


డీఆర్‌వో లక్ష్మణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

పాడేరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులను వెంటనే జమ చేయాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తికి గిరిజన సర్పంచులు సోమవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీలకు సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించి పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి లేకుండా చేసిందని, దీంతో గ్రామాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేకపోతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన సొమ్మును పంచాయతీల ఖాతాల్లో వేసేలా చర్యలు చేపట్టాలని సర్పంచులు బాకూరు వెంకటరమణరాజు, పాంగి పాండురంగస్వామి, కొట్టగుళ్లి ఉషారాణి, పలాసి శశిభూషణ్‌నాయుడు, తామర్ల సత్యనారాయణ శాంతికుమారి, విశ్వనాథం కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు బొర్రా ... మిగతా 8వ పేజీలో

నేటి నుంచి టెట్

ఉమ్మడి జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు

తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం నుంచి జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో ప్రారంభం కానున్నది. వచ్చే నెల ఆరో తేదీ వరకూ ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు సెషన్‌లలో జరగనున్నది. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఈ పరీక్షకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 37,556 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలుగా గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల (మధురవాడ), చైతన్య ఇంజనీరింగ్ కళాశాల (కొమ్మాది), నోబెల్ ఇంజనీరింగ్ కళాశాల (లంకెలపాలెం దరి మంత్రిపాలెం), ఐయాన్ డిజిటల్ జోన్ -1,2 (చినముషిడివాడ), ఐయాన్ డిజిటల్ జోన్ (షీలానగర్), జెన్ టెక్నాలజీస్ (చాణక్యనగర్, చినముషిడివాడ), ఎస్‌వీఎస్ టెక్నాలజీస్ (బీసీ రోడ్, పెదగంట్యాడ), ఏడీజడ్ డిజిటల్ జోన్ (శివాలయం ఎదురుగా, బుచ్చిరాజుపాలెం)ను ఎంపిక చేశారు. అభ్యర్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు, చిత్రంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పీవో అభిషేక్, తదితరులు

పాడేరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. స్థానిక కాఫీ హౌస్‌లో ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి అధ్యక్షతన బాల్య వివాహాల నియంత్రణపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేస్తున్నామని, ప్రభుత్వం బాలికా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ... మిగతా 8వ పేజీలో

మాతృభాషా వలంటీర్ల ధర్నా -వార్త 8లో..

100 కిలోల గంజాయి స్వాధీనం

నలుగురి అరెస్టు


ఎస్ఐ సంతోశ్‌తో కలిసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రుద్రశేఖర్, వెనుక వైపు నిందితులు

అరకులోయ, ఫిబ్రవరి 26: ఒడిశా రాష్ట్రం పాడువా నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న 100 కిలోల గంజాయిని ఆదివారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి అరకు సీఐ రుద్రశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు ముందస్తు సమాచారం రావడంతో డుంబ్రిగుడ మండలం జైపూర్ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒడిశా వైపు నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. అందులో వంద కిలోల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న హుకుంపేట మండలం బూరుగువలస గ్రామానికి చెందిన సంతోశ్‌కుమార్, పెదబయలుకు చెందిన పి.గజపతి, విశాఖపట్నం మధురవాడకు చెందిన శంకరరావు, విశాలాక్షినగర్‌కు చెందిన సురేశ్‌లను అరెస్టు చేశారు. కారును సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. గంజాయి, నిందితులను పట్టుకున్న డుంబ్రిగుడ ఎస్ఐ సంతోశ్, సిబ్బందిని సీఐ అభినందించారు.

క్రైం... crime news

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


గొంపా శ్రీను(ఫైల్)

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 26: మండలంలోని ధర్మసాగరం గ్రామంలో అప్పుల బాధతో నూతిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ భీమరాజ్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ధర్మసాగరానికి చెందిన గొంపా శ్రీను(38) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీను తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలో గల నూతిలో శవమై తేలి ఉన్న మృతదేహాన్ని గ్రామానికి చెందిన లక్ష్మణ గుర్తించి గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అది శ్రీను మృతదేహమేనని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య లోవకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లారీని ఢీకొన్న వ్యాన్.. నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన వ్యాన్

కశింకోట, ఫిబ్రవరి 26: జాతీయ రహదారిపై మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం దిబ్బిలివీధికి చెందిన ఆరుగురు వ్యక్తులు అన్నవరం పుణ్యక్షేత్రానికి టాటా ఏస్ వ్యాన్‌లో వెళుతున్నారు. కశింకోట వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేశాడు. దీంతో లారీ వెనుక భాగాన్ని వ్యాన్ ముందు భాగం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అమనాన చక్రపాణి, అమనాన భాగ్యరేఖ, సకలబత్తుల పావని, అలుపాని శ్రీనివాసరావు(డ్రైవర్) తీవ్రంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


జగన్నాథం మృతదేహం

ఎలమంచిలి, ఫిబ్రవరి 26: ఒడిశా నుంచి తెలంగాణ ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు.. ఎలమంచిలి మండలం పురుషోత్తపురం జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ సింహాచలం అందించిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభ గ్రామానికి చెందిన తురాయి జగన్నాథం(26) తెలంగాణ రాష్ట్రం మణుగూరులోని కేసీపీ పరిశ్రమలో సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం తన అన్న ద్విచక్ర వాహనం తీసుకుని సొంతూరు నుంచి మణుగూరుకు బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పురుషోత్తపురం సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌పై వున్న స్తంభాన్ని బలంగా ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ చెప్పారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

- మేడ పైన ఆడుకుంటూ విద్యుత్ వైర్లు పట్టుకోవడంతో ఘటన

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26: వడ్డాదిలో విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాజస్థాన్‌కి చెందిన జాలంసింగ్, అతని సోదరుడు చందనసింగ్ రాథోడ్ వడ్డాదిలో హార్డ్‌వేర్, ప్లంబింగ్ వ్యాపారం చేస్తున్నారు. జాలంసింగ్‌కి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు యువరాజ్‌సింగ్ రాథోడ్(10) ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్నాడు. పెద్ద కుమారుడికి ఎఫ్ఏ-4 పరీక్షలు జరుగుతుండడంతో ఆ బాలుడిని జాలంసింగ్ తన సోదరుడి ఇంటి వద్ద వదిలి బంధువుల వివాహానికి భార్య, చిన్న కుమారుడితో రాజస్థాన్ వెళ్లాడు. సోమవారం సాయంత్రం బాబాయి ఇంటి మేడపై ఆడుకుంటున్న యువరాజ్ సింగ్ ఇంటికి సమీపంలో ఉన్న విజయరామరాజుపేట ఫీడర్ 11 కేవీ లైన్ వైర్లను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు పెట్టాడు. కేకలు విన్న బాబాయ్ చందనసింగ్ రాథోడ్ కర్రతో యువరాజ్‌సింగ్ రాథోడ్‌ని కొట్టి వైర్ల నుంచి తప్పించాడు. చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ బాలుడు మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని కుటుంబీకులు, బంధువులు రాజస్థాన్ తీసుకువెళ్లినట్టు తెలిసింది.

తొమ్మిదో తరగతి విద్యార్థినిపై పీఈటీ అత్యాచారం

- గర్భం దాల్చడంతో బయటపడిన విషయం
- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- పోక్సో చట్టం కింద కేసు నమోదు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో మరో దారుణం వెలుగు చూసింది. కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ)గా పనిచేస్తున్న వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో కీచక ఉపాధ్యాయుడి బాగోతం బయటపడింది. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధురవాడ ప్రాంతంలోని ఒక కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను పీఈటీగా పనిచేస్తున్న బేరా దుర్గాప్రసాద్ (35) మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. సెలవు రోజుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు ఉన్నాయంటూ బాలికను పాఠశాలకు పిలిపించి అఘాయిత్యానికి పాల్పడేవాడు. ఈ క్రమంలో బాలికకు రెండు రోజుల కిందట కడుపు నొప్పి రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు..గర్భవతిగా నిర్ధారించడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఎన్నికల వేళ డబ్బు, మద్యం రవాణాపై నిఘా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26: రానున్న ఎన్నికల్లో నల్లధనం, అక్రమ మద్యం అరికట్టడానికి అవసరమైన నిఘా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగదు తరలింపుపై నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా పరిమితికి మించి నగదు రవాణా చేస్తుంటే ఆదాయ పన్ను శాఖకు సమాచారం ఇచ్చి చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ) ఎన్నికల ప్రకటన తేదీ నుంచి పనిచేయడం ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్‌టీఆర్ బాబ్జీ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సునీత, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమారి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి. రామ్మూర్తి, డీటీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

దారంతా మురుగుమయం

- సబ్బవరం ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీరు
- రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో అవస్థలు
- టీడీపీ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ పనులు నిలిచిపోవడంతో ఇక్కట్లు

సబ్బవరం, ఫిబ్రవరి 26: సబ్బవరంలోని ప్రధాన రహదారులు మురికి కూపాలుగా మారాయి. గతంలో ఇక్కడ నిర్మించిన డ్రైనేజీలు ఆక్రమణకు గురికావడంతో ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిచిపోవడంతో ఈ ప్రాంతవాసులకు అవస్థలు తప్పడం లేదు.

సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చోడవరం వెళ్లే రోడ్డు, పెందుర్తి వైపు వచ్చే రోడ్డు, అటు అనకాపల్లి వెళ్లే రోడ్డు, జోడుగుళ్ల నుంచి షీలానగర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్ అండ్ బీ స్థలాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. గతంలో నిర్మించిన డ్రైనేజీలను సైతం పూడ్చేసి కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇళ్లల్లోని వాడుక నీరు పోయే దారి లేక రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

నిలిచిన భూగర్భ డ్రైనేజీ పనులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్బవరంతో పాటు ఎనిమిది గ్రామాలను కలుపుతూ 29 కిలో మీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.24.46 కోట్లు మంజూరయ్యాయి. 2018 డిసెంబరు 27న అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. 2019 జనవరిలో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.


సబ్బవరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు


బేడ బుడగ జంగాల కాలనీ వద్ద ఇలా..

ఆక్రమణల తొలగింపు బాధ్యత రెవెన్యూశాఖదే

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, డ్రైనేజీలపై నిర్మాణాలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖదేనని ఆర్ అండ్ బీ ఏఈ కృష్ణారావు తెలిపారు. ఇప్పటికే ఆక్రమణలపై సర్వే చేసి హద్దులు నిర్ణయించామని, దీనిపై తహసీల్దార్‌కు రెండు సార్లు లేఖలు రాశామన్నారు. ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖ దేనని, అవసరమైతే తాము ఎక్స్‌కవేటర్లను సమకూరుస్తామని ఆయన చెప్పారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ


సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 : సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. కైలాసగిరి కొండ కింద ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బందికి నిర్వహిస్తున్న మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడారు. వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణ నిబద్ధతతో పని చేసి పోలీసు ప్రతిష్ఠను నిలపాలన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో శాంతి భద్రతలు కాపాడే క్రమంలో సిబ్బంది సివిల్ పోలీసులకు వెన్నుదన్నుగా నిలవాలని చెప్పారు. అనంతరం ఆయన ఇటీవల విజయవాడలో పలు రాష్ట్రాల పోలీసు జాగిలాల 32వ ఆర్మీ కోర్సులో భాగంగా జరిగిన పోటీల్లో మత్తు పదార్థాల గుర్తించడంలో ప్రథమ బహుమతి పొందిన అల్లూరి సీతారామ రాజు జిల్లా జాగిలం రాకీ, పేలుడు పదార్థాలను గుర్తించడంలో రెండో బహుమతి పొందిన అనకాపల్లి జిల్లా పోలీసు జాగిలం వోల్గా ట్రైనర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. తొలుత ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, డీఎస్పీ నాగేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'మద్య నిషేధంపై మాట తప్పిన జగన్'

అనకాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మద్య నిషేధంపై మాటతప్పిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచడమే కాకుండా నాసిరకం మద్యం విక్రయిస్తూ రూ.2 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నాసిరకం మద్యం తాగడం వల్ల రాష్ట్రంలో 30 లక్షల మంది అనారోగ్యం పాలవగా, 30 వేలమంది మృతిచెందారని పేర్కొన్నారు. మద్య నిషేధంపై మాట నిలుపుకోని జగన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభం

- ఎలమంచిలి స్టేషన్‌లో రూ.13.13 కోట్ల పనులకు భూమి పూజ
- అందుబాటులోకి ఐదు అండర్‌పాస్ వంతెలు
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ


ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రమణమూర్తిరాజు, పప్పల చలపతిరావు, సుందరపు విజయకుమార్, రైల్వే అధికారులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 26: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోని అనకాపల్లి జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రైల్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడానికి ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో రూ.13.13 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ములకలాపల్లి, తురంగలపాలెం వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అధికార, అనధికార ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డీసీఎం మహ్మద్ అలీ ఖాన్, జేఆర్‌సీ మెంబర్ శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లి మండలం పెదబోదిగల్లం సభలో మాట్లాడుతున్న ఎస్‌సీఆర్ ఏపీవో పి.శ్రీనాథ్


పాయకరావుపేట మండలం పీఎల్‌పురం వద్ద ప్రారంభించిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి

పెదబోదిగల్లం

రైల్వే అండర్ పాస్ ప్రారంభం

నక్కపల్లి : మండలంలోని పెదబోదిగల్లం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు వద్ద కొత్తగా నిర్మించిన అండర్ పాస్‌ను సోమవారం మధ్యాహ్నం దక్షిణ మధ్య రైల్వే ఏపీవో శ్రీనాథ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నాజీ, ఎంఈవో కె.నరేశ్, హైస్కూల్ హెచ్‌ఎం బోడిశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీఎల్‌పురం, నామవరం వద్ద..

పాయకరావుపేట రూరల్ : మండలంలోని పి.ఎల్.పురం, నామవరం గ్రామాల వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లను దక్షిణ మధ్య రైల్వే ఏడీఈ (ఆపరేషన్స్) సోమవారం పి.ఎల్.పురం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50 అండర్ బ్రిడ్జిలను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. స్వప్న, డి.టి. రాజేంద్రప్రసాద్, సర్పంచ్ పడాల సోమన్నదొర, ఎంపీటీసీ సభ్యురాలు నాగం వెంకటరత్నం, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

దార్లపూడి సమీపంలో...

ఎస్.రాయవరం: మండలంలోని దార్లపూడి సమీపంలో భీమవరం గ్రామ వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని సోమవారం పీఎం నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏటికొప్పాక గ్రామానికి చెందిన పద్మశ్రీ పురస్కారగ్రహీత సీవీ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ వర్మ, సర్పంచ్ శుభాషిణి, ఎంపీటీసీ సభ్యులు దేవుడమ్మ, అప్పయ్యమ్మ, రైల్వే అధికారి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్తరాంధ్రలో నారా భువనేశ్వరి పర్యటన



విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' (చంద్రబాబునాయుడు అరెస్టు కావడాన్ని తట్టుకోలేక మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను ఓదార్పు) కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం అధినేత సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం నుంచి ఒకటో తేదీ వరకు ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. ఆమె మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి నేరుగా పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు వెళతారు. కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తారు. మంగళవారం రాత్రికి అరకులోయ చేరుకుని బస చేస్తారు. బుధవారం అరకులోయ, పాడేరు నియోజకవర్గాల్లో కార్యకర్తల కుటుంబాలను కలిసి ఆర్థిక సాయం అందించి రాత్రికి నర్సీపట్నం చేరుకుని బస చేస్తారు. ఈనెల 29వ తేదీన నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో పర్యటించి రాత్రికి అనకాపల్లి చేరుకుంటారు. మార్చి ఒకటో తేదీన అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల్లో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి సాయం అందజేస్తారు. అక్కడ నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో చెన్నై వెళతారు.

సిటీ క్లబ్ అక్రమ నిర్మాణాలపై చర్యలు ఏవీ?

- మునిసిపల్ కమిషనర్‌ను నిలదీసిన ఆర్డీవో
- గతంలో చెప్పినా పట్టించుకోలేదంటూ ఆగ్రహం
- వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశం


నర్సీపట్నం క్లబ్ అక్రమ నిర్మాణాలపై మునిసిపల్ కమిషనర్ రవిబాబును (కుడివైపు నిల్చున్న వ్యక్తి) నిలదీస్తున్న ఆర్డీవో జయరామ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 26 : గ్రామ కంఠం స్థలంలో సిటీ క్లబ్ వారు వాణిజ్య భవన సముదాయం నిర్మిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్డీవో హెచ్‌వీ జయరామ్, మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబును నిలదీశారు. గ్రామ కంఠం స్థలంలో అక్రమంగా షాపులు నిర్మిస్తున్నారని నర్సీపట్నంకు చెందిన పాకలపాటి అరవింద్‌కుమార్ రాజు, కాళ్ల లోవ సోమవారం ఇక్కడ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన అక్కడే వున్న మునిసిపల్ కమిషనర్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ, గతంలో కూడా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవాలని చెప్పామని, ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు డబ్బులు తీసుకొని చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయని ఆర్డీఓ అన్నారు. కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ, వాణిజ్య భవన సముదాయం నిర్మాణంపై సిటీ క్లబ్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామని బదులిచ్చారు. దీంతో తీవ్ర అసహనం చెందిన ఆర్డీవో జయరామ్.. తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి


స్పందనలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి



జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలకు సంబంధించి సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జేసీ జాహ్నవి, డీఆర్వో బి.దయానిధితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యపై 336 అర్జీలు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ అర్జీని తిరస్కరిస్తే.. ఇందుకు కారణం కూడా తెలియజేయాలన్నారు. భూసమస్యలు, రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయని, సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, సీపీవో రామారావు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

అనకాపల్లిరూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురి సమస్యలను స్వయంగా ఆలకించారు. మొత్తం 22 అర్జీలు అందగా, అనంతరం వాటిని సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అర్జీలను త్వరగా పరిష్కరించి, వీటిపై తీసుకున్న చర్యల గురించి నిర్ణీత గడువులోగా నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు, ఎస్ఐ టి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో పీలా సోదరులు భేటీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడితో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆయన సోదరుడు పీలా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. అనకాపల్లి అసెంబ్లీ సీటుపే జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు కేటాయించడంతో పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం విజయవాడలో చంద్రబాబును కలిశారు. అయితే పీలా గోవింద సత్యనారాయణ కుటుంబీకులను బుజ్జగించాలని చంద్రబాబు భావించారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో కదలిరా సభకు హాజరైన చంద్రబాబు తిరుగుప్రయాణంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అయితే ఎయిర్‌పోర్టుకు పీలా గోవింద సత్యనారాయణ, పీలా శ్రీనివాస్‌లను తీసుకురావాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు చంద్రబాబు సూచించారు. దీంతో గోవింద సత్యనారాయణ, పీలా శ్రీనివాస్‌లను తీసుకుని వెలగపూడి సోమవారం రాత్రి ఎయిర్‌పోర్టుకు వచ్చారు. పీలా సోదరులతో చంద్రబాబు వీఐపీ లాంజ్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏం మాట్లాడింది బయటకు వెల్లడికాలేదు.

సంయమనంతో ఉండండి

- టీడీపీ శ్రేణులకు పీలా గోవింద సూచన


మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం క్రమశిక్షణగల పార్టీ అని, కార్యకర్తలు సంయమనం పాటించాలని నియోజకవర్గం ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ కోరారు. పొత్తులో భాగంగా అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించడం, అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పేరు ప్రకటించడంతో పీలా గోవింద ఆదివారం ఉండవల్లి వెళ్లి చంద్రబాబునాయుడును కలిశారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో పలువురు టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, పార్టీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యానని, ఆయనతో జరిగిన చర్చల వివరాలను రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తానని చెప్పారు. అనంతరం శ్రీకాకుళం పర్యటన ముగించుకుని విశాఖ విమానాశ్రయానికి రానున్న చంద్రబాబును కలిసేందుకు విశాఖపట్నం వెళ్లారు.

అరకు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభం

» వర్చువల్ విధానంలో పీఎం మోదీ శంకుస్థాపన


పీఎం సందేశాన్ని స్ర్కీన్‌పై ప్రదర్శిస్తున్న దృశ్యం

అరకులోయ, ఫిబ్రవరి 26: అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా సోమవారం పలు పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా అరకు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ మాట్లాడుతూ రూ.16 కోట్లతో అరకు స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. మన్యంలోని అరకు రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. రైల్వే అధికారులు వై.ఆనంద్, పాండీటాం మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా అన్ని సదుపాయాలతో వెయిటింగ్‌హాలు, మరుగుదొడ్లు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సుశాన్‌బ్లెస్సీ బక్కీ, దిలీప్‌కుమార్‌స్వాన్, తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎంపీడీవో వెంకటేష్, సీఐ రుద్రశేఖర్, డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


రైతులకు పిండి మిల్లులను అందిస్తున్న పీడీ ఆశదేవి

పెదబయలు, ఫిబ్రవరి 26: సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పీడీ ఎం.ఆశదేవి చెప్పారు. స్థానిక యువజన శిక్షణ కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షా విధానంతో కలిగే ఉపయోగాలను తెలుసుకోవాలని చెప్పారు. వనరుల కేంద్రం ఏడీఏ ఎం.విజయలక్ష్మి మట్టి నమూన తీసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా చిరుధాన్యాల క్షేత్రాలను నిర్వహిస్తున్న గంపరాయి, అడుగులపుట్ట గ్రామాలకు చెందిన గ్రూపుల్లోని ముగ్గురు రైతులకు 50 శాతం రాయితీపై చిరుధాన్యాల పిండి మిల్లులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏకలవ్య కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అరికట్టాలని ఆందోళన


హుకుంపేటలో నిరసన కార్యక్రమం చేపడుతున్న గిరిజన నేతలు

హుకుంపేట, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలో 1/70 చట్టాన్ని ధిక్కరిస్తూ జరుగుతున్న భూ ఆక్రమణలను అధికారులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ వివిధ ప్రజా సంఘాల నాయకులు రెండు రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. సోమవారం హుకుంపేటలో భూఆక్ర మణలు అరికట్టాలని, 1/70 చట్టాన్ని రక్షించాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు. అలాగే వెలుగు కార్యాలయానికి చెందిన భూమిని కొండమ్మ అనే మహిళ ఆక్రమిస్తున్న విషయం తెలుసుకున్న గిరిజన నేతలు ఆదివారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి ఆక్రమణను అడ్డుకున్నారు. అలాగే కొండమ్మ ఆక్రమించిన 20 సెంట్ల ప్రభుత్వ భూమిని, నిర్మాణాలను సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.కొండలరావు, గిరిజన సంఘం కార్యదర్శి టి.కృష్ణారావు, ఆదివాసీ సేన కన్వీనర్ రాజుబాబు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ఆదివాసీలకు రక్షణ కరువు

» అఖిల భారత సహాయ కార్యదర్శి తపస్వి ప్రరాజ్

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 26: బీజేపీ పాలనలో ఆదివాసీలకు రక్షణ కరువైందని అఖిల భారత (ఐద్వా) సహాయ కార్యదర్శి తపస్వి ప్రరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో ప్రభుత్వ విధానాలు-గిరిజనులపై ప్రభావం తదితర అంశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వారు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రాజెక్టుల పేరుతో ఏజెన్సీలోని ఖనిజ సంపదను దోచుకోవడానికే కేంద్ర ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో పేదలకు ఉండేందుకు ఇళ్లు లేని పరిస్థితిలో విశాఖ రుషికొండపై పెద్ద పెద్ద బంగ్లాలు ఎలా నిర్మాణం జరుగుతున్నాయని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ, ఎస్.ఈశ్వరి, సభ్యులు వి.రాధ, దసుధ, కుమారి, చితమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని కాంగ్రెస్ నిరసన


వారపు సంతలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెదబయలు, ఫిబ్రవరి 26: గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు కొర్ర కోమటి మాట్లాడుతూ జీవో నంబర్-3 తొలగించడం వల్ల గిరిజన యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతానికి ఆయువు పట్టులాంటి జీవో నంబర్-3ను తొలగిస్తుంటే ఈ ప్రాంతంలో గిరిజనుల ఓట్లతో గద్దె నెక్కిన ఎంపీలు, ఎమ్మెల్యేలు కనీసం స్పందించకపోవడం విచారకరమని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం వల్ల గిరిజన ప్రాంతానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, జీవో నంబర్-3కు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటబాబు, కొండబాబు, చిట్టిబాబు, ఆనంద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

ఇస్తున్నదన్నారు. బాలికలు ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్య దోహదపడుతుందన్నారు. టీనేజ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలని, వసతి గృహాల్లో ఉండే పిల్లలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాలికల హక్కులను కాపాడాల్సిన బాధ్యత సమాజంలో అందరిపైనా ఉందన్నారు. బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి బాలికా కనీసం డిగ్రీ వరకు చదువుకోవాలని ఆమె కోరారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఈ సందర్భంగా బేటీ బచావో.... బేటీ పడావో గురించి వివరించారు. ఆడపిల్లలను కాపాడాలని, ఆడ పిల్లలను చదివించాలని ఆయన సూచించారు. స్థానిక ఏఎస్పీ కె.ధీరజ్ మాట్లాడుతూ 20 ఏళ్లు కష్టపడి చదివితే 60 ఏళ్లు సుఖ పడతారన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ పీవోలు, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

నాసిరకం మద్యంతో రూ.లక్షల కోట్ల అక్రమార్జన

» మద్యం ప్రియుల ఆరోగ్యానికి ముప్పు... మహిళల అగచాట్లు

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



పాడేరు రూరల్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో నాసిరకం మద్యంతో లక్షల కోట్ల రూపాయలను అక్ర మంగా ఆర్జిస్తున్నారని, మద్యం ప్రియుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ఊకదంపుడు కబుర్లు చెప్పిన జగన్‌రెడ్డి, మాట తప్పి మడం తిప్పి నాసిరకం మద్యాన్ని ప్రభుత్వం ద్వారా విక్రయిస్తు న్నారన్నారు. తద్వారా లక్షల కోట్ల రూపాయల అక్రమ సంపాదనను తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించుకున్నారని ఆరోపించారు. తన ఆర్థిక లాభం కోసం నాసిరకం మద్యం అమ్మకాలు చేపట్టి మహిళల మాంగల్యాలతో చెలగాటం ఆడుతున్న సైకో జగన్ పోవాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జగన్ అమ్మకాలు చేపట్టిన నాసిరకం మద్యం సేవించి సుమారు 30 వేల మంది ప్రాణాలను కోల్పోయారని ఆమె ఆరోపించారు. మద్యాన్ని సంపూర్ణంగా నిషేధిస్తామన్న జగన్, అమలు చేయలేదు సరికదా రాష్ట్రంలో నాలుగు లక్షల బెల్టు దుకాణాలు, మొబైల్ షాపులు పెట్టి ప్రజల రక్త మాంసాలతో మద్యం వ్యాపారం చేస్తు న్నారన్నారు. రాష్ట్రంలో అక్రమ మద్యం వ్యాపారాలు జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి సిండికేట్‌ల ద్వారానే జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. జగన్ నిజస్వరూపం తెలుసుకున్న రాష్ట్ర మహిళలు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు సీఎం కావాలి

పాడేరు రూరల్: రాక్షస పాలన పోయి రాష్ట్రాభివృద్ధి జరగాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. బడిమెల పంచాయతీ పరిధిలోని బడిమెల కాలనీ, వల్లయి, ఇసకగరువు, కొలంబో, సాకిపుట్టు గ్రామాల్లో సోమవారం బాబు షూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలన్నా, మన భవిష్యత్‌కు భరోసా కావాలన్నా సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒక్క ఛాన్స్ ఇస్తేనే రాష్ట్రాభివృద్ధిని 20 ఏళ్ల వెనక్కి నెట్టిన జగన్‌రెడ్డికి మరో ఛాన్స్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్తన పిన్నయ్యదొర, సావిత్రమ్మ, రమణమూర్తి, నారాయణ, సూర్యనారాయణ, కె.రమణ, కె.భాస్కర్, కె.శ్రీను పాల్గొన్నారు.

రెన్యువల్ చేయకుంటే ఆందోళన ఉధృతం

» మాతృ భాషా వలంటీర్ల ధర్నా శిబిరంలో అప్పలనర్స



ధర్నా శిబిరం వద్ద మాట్లాడుతున్న అప్పలనర్స

పాడేరు రూరల్, ఫిబ్రవరి 26: ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స హెచ్చరించారు. ఇందుకోసం చేపట్టిన 24 గంటల ధర్నాను సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ గిరిజన విద్యపై ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో మాతృ భాషా విద్యా వలంటీర్ల రెన్యువల్ కోసం ప్రతి ఏటా పోరాడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలలకు రెన్యువల్ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాతృ భాషా విద్యా వలంటీర్లను శాశ్వతంగా విధుల్లో కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల రెన్యువల్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘం నాయకులు పి.శ్రీను, చిట్టిబాబు, చంద్రయ్య, వీరయ్య, గణేష్ కుమారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా కారక దోమల నివారణకు చర్యలు

» జిల్లా మలేరియా నివారణాధికారి ప్రసాద్


పాఠశాల ఆవరణలో నీటికుండీను పరిశీలిస్తున్న డీఎంవో

కొయ్యూరు, ఫిబ్రవరి 26: మలేరియా కారక దోమల నివారణకు ఇండోర్ స్పేస్ స్ప్రే (ఐఎస్ఎస్) చేయడానికి చర్యలు చేపట్టామని జిల్లా మలేరియా నివారణాధికారిధికారి పీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. కొయ్యూరు గురుకుల పాఠశాలలో విద్యార్థులు జ్వరాల బారిన పడుతుండడం, ఆదివారం పదో తరగతి విద్యార్థి ప్రవీణ్‌కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఐటీడీఏ పీవో స్పందించారు. ఈ మేరకు సోమవారం డీఎంవో గురుకులాన్ని సందర్శించి విద్యార్థులకు ఎన్‌వీపీడీసీ తరపున రక్త పరీక్షలతో పాటు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రెండు వాటర్ ట్యాంకులకు మూతల లేకపోవడాన్ని గుర్తించి వెంటనే మూతలు ఏర్పాటు చేయించారు. గతంలో మలేరియా స్ప్రేయింగ్ చేసిన నేపథ్యంలో ఐఎస్ఎస్ చేయాలని సబ్ యూనిట్ అధికారి నీలకంఠంనాయుడును ఆదేశించారు. గురుకుల విద్యార్థులకు పూర్తి స్థాయిలో మలేరియా పరీక్షలు చేయగా, ఎవరికీ లక్షణాలు లేవని నిర్ధారణ జరిగిందన్నారు. మలేరియా, డెంగ్యూ కారక దోమల నివారణకు సంబంధించి అన్ని చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ చర్యల్లో భాగంగా వైద్య శిబిరం కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంపీడీవో సీతయ్యనాయుడు, ప్రిన్సిపాల్ మోహన్, వైద్యాధికారి మనోగ్న, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలను చైతన్యపరచండి

పాడేరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలను చైతన్యవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ సూచించారు. తన కార్యాలయంలో సోమవారం ఆమె ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 27వ తేదీన హుకుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహించి బ్యాంకింగ్ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని ఎల్‌డీఎం ఎన్.రవితేజ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ టి.కిశోర్‌కుమార్, యూనియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ఎ.భానుశేఖర్ పాల్గొన్నారు.

నిజం గెలవాలి సభకు తరలిరండి: లక్ష్మణరావు

చింతపల్లి, ఫిబ్రవరి 26: పాడేరులో బుధవారం నిర్వహించే నిజం గెలవాలి సభకు తరలిరావాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక గుండె ఆగి పోయిన ఆదివాసీలను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి జి.మాడుగుల వస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పాడేరులో నిర్వహించే సభలో ఆమె పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే సభకు గిరిజన ప్రాంతానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ ఇన్‌చార్జి సరమండ శ్రీధర్, క్లస్టర్ ఇన్‌చార్జులు పాంగి రాము, భీమన్న, పార్టీ నేతలు సోమేశ్, రమణ పాల్గొన్నారు.

365 ఎల్ఈడీ బల్బులు: ఎంపీడీవో

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 26: ఎంపీ గొడ్డేటి మాధవి నిధుల కింద మండలానికి 365 ఎల్ఈడీ బల్బులను మంజూరయ్యాయని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. కొన్ని గ్రామాలకు జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎంపీపీ ఎ.సీతమ్మ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. 23 పంచాయతీల పరిధిలో సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో మిగిలిన గ్రామాల్లో బల్బులను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు సహించం

» జిల్లా విజిలెన్స్ అధికారి పూర్ణిమ

హుకుంపేట, ఫిబ్రవరి 26: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు తేలితే సహించేది లేదని జిల్లా విజిలెన్స్ అధికారి పూర్ణిమ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా తనిఖీల వివరాలను డీఆర్పీలు నివేదించారు. అనంతరం విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ ఈ పథకం పనుల్లో నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, వీఆర్పీలపై నిజాలు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, ఉపాధి పథకం ఏపీడీ పవన్, ఏపీవో మూర్తి, వీఆర్పీలు, కూలీల పాల్గొన్నారు.

పంచాయతీల నిధులు జమ చేయండి

... 5వ పేజీ తరువాయి

నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనకు సహకరించాలి

ఏజెన్సీలో ఈ నెల 27, 28 తేదీల్లో నారా భువనేశ్వరి పర్యటించనున్న నేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు పోలీసులు సంపూర్ణంగా సహకరించాలని కోరుతూ టీడీపీ నేతలు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 27న భువనేశ్వరి అరకులోయ చేరుకుంటారని, 28న అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో ఆమె పర్యటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, గిరిజన సర్పంచులు పాల్గొన్నారు.

ఆగని గిరి విద్యార్థుల మరణాలు

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టడం లేదు. దీంతో పరిస్థితులు భిన్నంగా మారుతున్నాయి. ఫలితంగా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టని పరిస్థితి కొనసాగుతున్నది.

42 రోజులు దీక్షలు చేసినా స్పందించని సర్కారు

ఏజెన్సీలో గిరిజన విద్యార్థుల మరణాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరపాలనే డిమాండ్‌పై గత ఏడాది ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ముందు 42 రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఐక్య వేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షల్లో వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు పాల్గొని మద్దతు తెలిపాయి. గిరి విద్యార్థుల మరణాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరపాలని, మరణాలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోగా విద్యార్థుల మరణాల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అందువల్లే ఈ విద్యా సంవత్సరంలోనూ విద్యార్థుల మరణాలు కొనసాగుతున్నాయని ఐక్యవేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ ఆరోపిస్తున్నారు.

లేఖ విడుదల చేసిన మావోయిస్టులు

ఏజెన్సీలో గిరిజన విద్యార్థుల మరణాలపై మావోయిస్టులు సైతం స్పందించారు. ఈ మేరకు ఈ నెల 14న మీడియాకు లేఖ విడుదల చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నారని, అందుకు బాధ్యులైన పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని సైతం మావోయిస్టులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు పోషకాహారాన్ని, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విద్యార్థుల మరణాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని మావోయిస్టు పార్టీ నేత విశాఖ, అల్లూరి, అనకాపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ ఆ లేఖలో డిమాండ్ చేశారు.

చేపట్టాల్సిన చర్యలివి

- విద్యాలయాల్లోని గిరిజన విద్యార్థులకు ప్రతి నెలా విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి
- అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక స్టూడెంట్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలి.
- స్కూల్ హెల్త్ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించాలి.
- ప్రతి ఆశ్రమ పాఠశాలల్లోనూ హెల్త్ వలంటీర్‌ను నియమించి, వారి ద్వారా విద్యార్థుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి.
- మండల స్థాయిలో విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై మండల ప్రత్యేకాధికారి, ఏటీడబ్ల్యూవోల పర్యవేక్షణ చేయాలి.
- గిరి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు మన్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టాలి.
- విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను రోజూ క్లాస్ టీచర్ పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలి.

కొత్త గ్యాస్ గోదాము నిర్మాణం జరిగేనా?

... 5వ పేజీ తరువాయి

వెంటనే నిర్మించే పరిస్థితి లేకపోవడంతో మార్కెట్ యార్డులో నిరుపయోగంగా ఉన్న మరో గోదాముకు మరమ్మతులు చేపట్టి అద్దెకు ఇవ్వాలని మార్కెట్ కమిటీ అధికారులను జీసీసీ అధికారులు కోరారు. అయితే మార్కెట్ కమిటీ వద్ద గోదాము మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన నిధులు లేవు. ఈ నేపథ్యంలో మరి కొంత కాలం జీసీసీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

గ్యాస్ గోదాముకి 30 సెంట్ల స్థలం కేటాయింపు

చింతపల్లి మండల కేంద్రంలో గ్యాస్ గోదాము నిర్మించుకునేందుకు రెవెన్యూ అధికారులు 30 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలాన్ని సర్వే చేసి అధికారికంగా రెవెన్యూ అధికారులు జీసీసీకి అప్పగించారు. స్థలం అందుబాటులో ఉన్నప్పటికి భవన నిర్మాణం ప్రారంభం కాకపోవడంపై జీసీసీ గ్యాస్ నిర్వాహకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

- పి.దేవరాజు, జీసీసీ డీఎం, చింతపల్లి డివిజన్

గ్యాస్ గోదాము నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారుల ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం వచ్చిన వెంటనే జీసీసీ, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలి. ప్రభుత్వం, జీసీసీ నిధులు విడుదల చేయగానే గోదాము నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. గ్యాస్ గోదాముకి శాశ్వత భవనం అందుబాటులో లేకపోవడం వల్ల కలిగే ఇబ్బందులను జీసీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. ఎండీ నుంచి సానుకూల స్పందన వచ్చింది.

సంక్షిప్తంగా..

పాడేరులో మార్చి 6 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 26: జిల్లా కేంద్రం పాడేరులోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 6వ తేదీ నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 6వ తేదీన ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అలయం నుంచి ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నరసింగరావు దంపతులు, మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి చేతుల మీదగా శివపార్వతుల కల్యాణానికి పట్టువస్త్రాలను అందిస్తారన్నారు. అలాగే 7న సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారి పల్లకీసేవ, భారీ ఊరేగింపు చేపట్టనున్నామన్నారు. 8న ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, కొట్టగుళ్లి రామారావు, పలాసి బాలన్న, పోతురాజు, శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, సిద్ధినాతి కొండలరావు, భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలి

కొయ్యూరు, ఫిబ్రవరి 26: జి.మాడుగుల మండలం కిండంగిలో బుధవారం నిర్వహించనున్న నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు ఎంవీవీ ప్రసాద్, కొట్టగుళ్లి సుబ్బారావు పిలుపునిచ్చారు. భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కదలిరావాలని కోరారు. వారి వెంట పార్టీ నేతలు శ్రీరామ్మూర్తి, కాకర చంద్రరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

» జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 26: ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడానికే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. సుజనకోట పంచాయతీ కేంద్రంలో సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు ప్రభుత్వ పనుల కోసం మండల కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండా పంచాయతీల వారీగా సచివాలయాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో ఐదుగురు గిరి రైతులకు రాయితీపై చోడి పిండి మర మిల్లులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచ్ వి.రమేష్, ఏవో శ్రీనుబాబు పాల్గొన్నారు.

గంజాయి సాగుకు దూరంగా ఉండాలి

చింతపల్లి, ఫిబ్రవరి 26: ఆదివాసీలు గంజాయి సాగుకు దూరంగా ఉండాలని సీఐ కె.రమేష్ సూచించారు. అన్నవరం వారపు సంతలో సోమవారం గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలను ఆదివాసీలకు వివరించారు. గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఒక్క గంజాయి మొక్క సాగు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి రవాణా చేస్తూ పట్టిబడితే జీవితం నాశనమైట్టేనని చెప్పారు. రెండుసార్లకు మించి పట్టుబడితే పీడీ యాక్టు పెడుతున్నామన్నారు. అలాగే సంఘ వ్యతిరేక శక్తులకు దూరంగా ఉండాలన్నారు. ఓటు హక్కు ఉన్న వారంతా నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని, సమర్థవంతమైన నేతలను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లొద్దు

జి.మాడుగుల, ఫిబ్రవరి 26: గిరిజన గ్రామాల్లో అసంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ రమేశ్ సూచించారు. బీరం పంచాయతీ వనల్ప గ్రామంలో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తుండంతో గ్రామాల్లో అల్లర్లు, నాటు సారా క్రయ,విక్రయాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని గ్రామస్థులకు హెచ్చరించారు. స్థానిక సమస్యలపై తమకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

'బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

జి.మాడుగుల, ఫిబ్రవరి 26: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని గిరిజన మోర్చ మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కురుసా పార్వతమ్మ చెప్పారు. సింగర్ప, పాలమామిడి పంచాయతీల పరిధిలోని సీకుంబంధ, ఎం.నిట్టాపుట్టు, ఏడుచవాడ్లు గ్రామాల్లో సోమవారం ప్రజా పోరుయాత్ర-2 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రజలకు చేరవేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫమలమైందని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైసీపీ విధానాలకు ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.నూకరాజు, నాయకులు ఎస్.సింహాచలం, సుబ్బారావు, ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణచారి, గణేశ్ పాల్గొన్నారు.

సీలేరు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

సీలేరు, ఫిబ్రవరి 26: ఇంటర్ పరీక్షా కేంద్రానికి సోమవారం ప్రశ్నాపత్రాలు వచ్చాయి. ఇంటర్మీడిట్ బోర్డు అధికారులు విశాఖపట్నం నుంచి ప్రత్యేక వాహనంలో రూట్ ఆఫీసర్లతో సెట్ 2 పేపర్లను సీలేరుకు తీసుకు వచ్చారు. డీవో కేవీ.రత్నం, సీఎస్ ఎ.సాయిరామ్ ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్టేషన్‌లో భద్రపరిచారు. సీలేరు కేంద్రంలో 103 మంది విద్యార్థులు రాస్తున్నారని ఈ సందర్భంగా సీఎస్ సాయిరామ్ తెలిపారు.

జీవో నంబరు-3 పునరుద్ధరించాలి

చింతపల్లి, ఫిబ్రవరి 26: వైసీపీ ప్రభుత్వం జీవో నంబరు-3 పునరుద్ధరించి ఆదివాసీ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఈ జీవో రద్దు చేయడంతో ఆదివాసీ యువతకు తీరని అన్యాయం జరుగుతున్నదన్నారు. తాజాగా మెగా డీఎస్సీ అంటూ వైసీపీ ప్రభుత్వం దగా డీఎస్సీని ప్రకటించిందన్నారు. జీవో-3 అమలులో ఉంటే షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాలు గిరిజన అభ్యర్థులతో భర్తీ చేసే అవకాశం ఉండేదన్నారు. అతని వెంట సీపీఎం నేత ధనుంజయ్ ఉన్నారు.

డుంబ్రిగుడ: ప్రభుత్వ ఉద్యోగాల్లో గిరిజనులకు శత శాతం రిజర్వేషన్ కల్పించిన జీవో నంబరు-3ను పునరుద్ధరించాలని ఒంటిపాక జంక్షన్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనకు దిగారు. ఈ జీవో అమలుతో పాటు ప్రత్యేక డీఎస్సీ భర్తీ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు, గిరిజన యువత పాల్గొన్నారు.